# సప్తవర్ణ సమ్మిశ్రితం

**తో**టలో కూరగాయలు కోసి ఇంటికొచ్చిన స్వర్ణకి, ఇంటి ముంగల పెద్ద గుంపు ఎదురైంది. అమ్మలు, పిన్నులు, అత్తలు, అమ్మమ్మలు, ఒకరా ఇద్దరా పేటలో ఆడాళ్లంతా ప్రేమలతమ్మ స్కూటరు చుట్టూ పోగయ్యారు. ఆవిడొచ్చిందంటే ఏదో ఒక మీటింగ్ పెడుతుంది. అప్పటికి మీటింగ్ అయిపోయినట్టే వుంది. "ఆలోచించుకోండి తల్లులూ," అనేసి బర్రున ఒక కిక్ కొట్టి దుమ్ము రేపుకుంటూ పోయింది. మీటింగ్ కాడ కూసున్న అమ్మ, ముసలమ్మ మాట మర్చిపోయింది కామాల, ఆంగారి (ఆమెగారి) దగ్గర ఒకటే కంపు.

తన్ని చూసి, "ఒసే స్వర్నా ఇట్టా రావే," అని పిలిచింది

బెండకాయలు కోసి రావడంతో ఒళ్ళంతా నూగు. ఒకటే దురద. తొందరగా తానం చేద్దామనుకుని, 'పోన్లే పాపం", అని ముసలమ్మ పక్కబట్టలు మార్చింది. నులక మంచం మీద ప్లాస్టిక్ ఎరువుల సంచీలు ఉతికి కుట్టిన పట్టా, దాని మీద ఒక బొంత, బొంత మీన పాతచీరె. పట్టా తప్ప అన్నీ తడిసి కంపు కంపు... ఆమె కట్టుకున్న చీరె ముద్దైపోయింది. విసుక్కుంటూ జాలిపడుతూ అంతవరకూ ఆమెను పట్టించుకోని తల్లిని తిట్టుకుంటూ ఎట్టాగో ముసలమ్మకో పొడిచీరె కట్టి పట్టా మీద రెండు చీరెలు పక్కేసి పడుకోబెట్టింది.

ఆ మీటింగేందో ఆరా తియ్యకుండానే స్నానానికి పోయింది స్వర్ణ. అన్నాలప్పుడు అమ్మ మొదలెట్టింది.

"సుబ్బారావు సార్ అనే ఒక సారు ముసలాళ్లకి సేవచేసే సమస్థ ఒకటెట్టాడంట. అందులోకి పద్దెనిమిది ఇరవై అయిదేళ్ళ మద్దె పిల్లల్ని తీసుకుని నర్సు ట్రెయినింగ్ ఇస్తాడంట. జబ్బుపడి మంచానున్న ముసలాళ్ల దగ్గర పెడతాడంట. పిల్లల తిండీ తిప్పలూ అన్నీ ఇంటి గలాళ్ళయ్యేనంట. నెలకి నాలుగువేలిస్తాడంట. ఇంటి పన్లేం చెయ్యక్కర్లేదంట. అంటే అంట్లూ బట్టలూ ఇల్లూడ్చడం అట్టాంటియన్నమాట. ముసలాళ్లని సూసుకుంటే సాలంట. మన జిల్లాలో ఇప్పటికే ఇరవై మంది పిల్లలు సేరారంట," అంది.

"ఏందీ అంతమంది పిల్లలకి ఖాళీలుంటయ్యా?" అని ఆశ్చర్య పోయాడు నాన్న.

"మరి ఇప్పుడు డబ్బులున్న ముసలాళ్లకి ఇంటో మనుషులు చెయ్యడానికి టైం వుండట్లేదంట. అందుకే ఇట్టా మనుషుల్ని పెట్టుకుంటున్నారని ప్రేమలతమ్మ చెప్పింది."

"అంటే మంచాన పడ్డాళ్లకి ఒకటికీ రెండుకీ కూడా బాగుసెయ్యాల్నా ఎట్టా?" అన్నాడు నాన్న.

"మరి ఆస్పత్రులో నర్సులు ఆయాలూ చెయ్యట్లేదా? అట్టాగే. నర్సులకైనా ఇంతేనంటగా ప్రయివేటు ఆస్పత్రుల్లో ఇచ్చేది. పైగా తిండి కర్చుండదు. కావాలంటె సబ్బులకీ నూనెలకీ పౌడర్లకీ పేస్టులకీ అని ఓ రెండు మూడొందలు పోయినా నెలకి నిఖార్సుగా మూడేల పైన్నే వస్తయ్. ఓ ఏడాది బ్యాంక్‌లో ఎట్టినా ఏదైనా ఖర్చుకు వస్తయ్. ఏమంటావే స్వర్నా?" అంది

అప్పటికే ప్రేమలతమ్మ అమ్మకి మంత్రం వేసేసింది.

"నేనెక్కడికీ పోను, వచ్చే సమ్మత్సరం కాలేజీలో చేర్తాను. అయినాగానీ ఇంటో ముసలమ్మని ఒదిలిపెట్టి బయటోళ్ళకి సెయ్యాలేంటీ?" అంది స్వర్ణ గట్టిగానే.

"సాల్లే ఊర్కో! ఇంటో ముసలమ్మకి నేంగాక ఎవరు సేస్తున్నారేంటి? మీ అత్త మొగుడికి డాబా ఇల్లుంది. సంపాయిస్తున్నాడు. ఒక్కనాడైనా తల్లిని తీసుకెళ్ళిందా? అంగార్ని మేం చూస్కోపోతే ఎవరు చూస్తున్నారెట్టా? మహా ఈపూట పక్క ఏసావు అంతేగా?" అంది తల్లి.

ఆ వరసన వారానికొకపాలి ప్రేమలతమ్మ రాడం, పేటలో అమ్మలందరికీ మంత్రవెయ్యడం చివరికి ఒక పదిమంది దాకా సుబ్బారావు సార్ సేవా సంస్థలో చేరడం అయింది.

'ఇదెంత మంచిపని! పెద్దాళ్లకి సేవ చేస్తే పుణ్యం కూడా,' అని అమ్మ తల్లులు తలాడించారు. ముఖ్యంగా మగ పిల్లల వేధింపుల బెడద లేకుండా ఆడపిల్లలు నాలుగు గోడల మధ్య వుండి వాళ్ల తిండి గడుపుకుని పెళ్ళిఖర్చుకు సంపాయించుకోడం నచ్చింది.

"మేనమామలు, మేనత్త కొడుకులు కూడా కట్నాలడిగే పిదపకాలం వొచ్చింది. పెళ్ళికర్సులు లక్షల్లోకి రాడం ఇంతకుముందెరుగుదుమా? కట్నాలకి తోడు ఈళ్ళకి అందచందాలు కూడా కావాలిప్పుడు. పోనీ సదువు చెప్పిద్దామంటే ఆ పదోక్లాసు గండం గట్టెక్కదాయె! అదెట్టాగో గట్టెక్కి ఇంటర్లో జేరిస్తే, ఇహ అక్కడ్నుంచీ బండి కదలదు. ఏం సదువులో ఏమో! ఉత్తరం సదివి సెప్పడానికి ఒకేమైన ఆయాసపడిపోతారు. ఇంటో కూసోబెట్టే సక్తిలేక పనికి పంపితే పొలాలెంబడ కూరగాయల తోట లెంబడ పొద్దుట్నించీ సందేళ దాకా కంపన బడ్డ కాకులాలె ఎండకి మాడి నల్ల కప్పేసి పోతున్నారు. ఇప్పుటి టీవీలొచ్చి పడ్డకాడ్నించీ పిల్లలకి కర్చులు ఊ పెరిగిపోయినయ్. పెదాలు పగలకుండా ఒక టూబు. మొహం తెల్లబడ్డానికో టూబు. రేతిరి పడుకునే ముందొక టూబు! ఓయ్ నాయనోయ్! ఎన్నడెరగం ఈ ఇద్దూరం," అంది ఒక తల్లి.

"ఇదంతా ఆ మాయదారి టీవీ వల్లే దాపరించింది. దొడ్డో ఉన్న కుంకుడుచెట్టు కాయలు పనికిరావు. జుట్టు మెరిసిపోయే సాంపూలు గావాలి. ఏదో పెళ్లికో పండక్కో కాదు ఊరూరికే గోరింటాకు కొనిపెట్టుకోటం. ఒక సోకు కాదు నాతల్లో! తింటానికి అదివరకటి పప్పులు పనికిరాడంలేదు. నూడిల్సంట, అయ్యి గావాలి. ప్రేమలతమ్మ సెప్పినట్టు కొన్నాళ్లపాటు నీడపట్టునుండనియ్," అనేసి ఒక బ్యాగూ ఒక సెల్ ఫోనూ కొనిచ్చి ఒక అయిదొందలు చేతిలో పెట్టి సాగనంపారు.

పొద్దునా సాయంత్రం ఫోను చేస్తూ వుండమని ఏ కష్టం వచ్చినా చెప్పమనీ రెక్కలు కట్టుకుని వచ్చి వాల్తామనీ మరీ మరీ చెప్పారు. సెల్‌ఫోన్‌లో ఎఫ్.ఎం రేడియో యియర్ ఫోన్లూ కూడా వుండేట్లు తెచ్చిచ్చాడు నాన్న. స్వర్ణేమో బజారుకెళ్ళి ఆరువారాల్లో తెల్లబడే క్రీమొకటి, ఒత్తుగా జుట్టు మొలిచే వాసన నూనె సీసా ఒకటి, పుట్టిన పిల్లలకు పదేళ్ళొచ్చినా పెళ్ళికానిపిల్లల్లా వుండడానికే తయారుచేసిన సబ్బులొక నాలుగూ, పట్టు లాంటి జుట్టుకోసం ఒక డజను షాంపూ ప్యాకెట్లూ, తలనెప్పి బామ్‌డబ్బా, సానిటరీ నాప్‌కిన్లూ, పౌడరుడబ్బా ఒకటి, నాలుగైదు తలకు పెట్టుకునే పిన్నులు కొనుక్కొచ్చుకుంది. వాటితో పాటే కాసిని చూయింగ్‌గమ్‌లు, నాలుగు చాక్లెట్లూ తెచ్చుకుంది. ఆ దెబ్బతో నాన్నిచ్చిన ఐదొందల్లో చాలావరకు అయిపోయాయి.

అదిగో అట్టా వచ్చిపడింది స్వర్ణ ఈ గచ్చకాయ ముసలమ్మ దగ్గిరకి. ఆవిడకేదో పేరుందిలే. తను మాత్రం ఇట్టా చెప్పుద్ది తన ఫ్రెండ్స్‌కి. ఇంతకీ ఈ గచ్చకాయ మామ్మ కథేందంటే ఈ మామ్మకి ఎనభైఅయిదేళ్ళంట. మునుపు కొడుక్కాడ ఉండేదంట. కోడలు ఆంగారి కూతురికి పురుడు పొయ్యటానికి అమ్రికా పోతూ ఈవిడ్ని ఇక్కడ కుమ్మరించిందంట. ఆర్నెల్లకి కోడలు రాంగానే మళ్ళీ ఈవిడ అక్కడ కెళ్ళిపోతుంది. మామ్మ కూతురికి ఏదో ఉద్యోగం. టిప్పుటాప్పుగా ఉంటది. జుట్టుకి రంగేస్తది. ఆఫీస్ నుంచీ రాంగానే టీ తాగేసి ఒక పది ఫోన్లు మాట్టాడి టీవీ కాడ సెటిలైపోద్ది. ఆవిడ ఇంటికొస్తేనే టీవీ... ఆఫీసుకి పోతూ టీవీ గది తాళం వేసుకు పోద్ది. మూణ్ణెల్లకి రిటైరై పోద్దంట. అల్లుడేం చేస్తాడో తెలీదుగానీ మంచోడు. ముసలమ్మని సక్కగా పలకరిస్తాడు. అత్త మొగుడూ వున్నాడు నాయనమ్మని గుమ్మంలోకి రానీడు.

❖ ❖ ❖

"నిండు కెంపురంగుకి పచ్చిపసుపు రుద్రాక్షల అంచు! అంచుకు చిన్న చిన్న కొండలు... నేనేమో చామనఛాయ! నాకు ఆ చీరె నప్పుతుందా లేదా అని ఎంత తటపటాయించానో కానీ కట్టుకుంటే ఎంత బాగుందో... ఆ రోజుల్లో ఆ కంచి పట్టుచీరె ఎంతనీ! నూటయాభై అంతే.."

ముసలమ్మ కళ్ళు మూసుకుని తనలో తనే మాట్లాడుకుంటోంది. పదోక్లాసు దాకా తెలుగు మాధ్యమంలో చదివిన స్వర్ణకి తెలుగు రంగులు అర్థంకావు. ముసలమ్మ ఎప్పుడూ ఇట్టాగే అర్థంలేని మాటలు మాట్లాడుతుంది. పద్యాలు కూడా అప్పజెబుతుంది. కూనిరాగాలు తీస్తుంది. అందుకని వింటున్నట్టే నటిస్తూ తల ఊపుతూ చెవిలో యియర్ ఫోన్లు పెట్టుకుని సెల్‌ఫోన్లో పాటలు వింటూ వుంటుంది స్వర్ణ. ఆవిడొకసారి ఆ సంగతి కనిపెట్టి చేత్తో దగ్గరకు రమ్మని సైగ చేసింది.

"కాసిని మంచినీళ్ళిస్తావేమో అని పిలుస్తున్నా, ఇందాకటినించీ నువ్వు చెవిలో పాటలు పోసుకుంటున్నావు కదా అందుకని చేత్తో పిలిచా! ఇకనించి ఇట్టాగే పిలుస్తాలే! నా ఎదురుగా కూచుని వింటూండూ." అంది చాలా శాంతంగా.

"మీరు ఎర్ర టాబ్లెట్ వేసుకునే టైం అయింది", అంది స్వర్ణ, టాబ్లెట్ తెచ్చి మంచం దగ్గర నిలబడి. ఆవిడ మళ్ళీ ఏదో గచ్చకాయరంగు గురించి ఎత్తుకుంది.

"మందేసుకో మామ్మా!" అంది స్వర్ణ, కాస్త విసుగ్గానే. ముసలమ్మకి కళ్ళల్లో నీళ్ళొచ్చాయి. "ఇట్లా కళ్లల్లోనో ముక్కులోవో నీళ్ళొస్తే గబుక్కున పమిటతో తుడుచుకునే అలవాటు. వాయిల్‌చీరెలు ఎంత మెత్తగా వుండేవో! ముక్కు పమిటతో తుడుచుకుంటే మా అత్తగారు తిట్టేది... అత్తగారు చీరెలోనే తనువు చాలించింది. ఇష్టమైన మానుగాయి రంగు జరీచీరె కట్టించుకుని మరీ. నారపీచు జుట్టుని నాచేతే దువ్వించుకుని ముడేయించుకునేది," అంటూ, పమిటకొంగు కోసం తడుముకుని అది లేకపోగా రుమాలు కోసం పక్క మీద చూసింది.

"మందేసుకో మామ్మా! ఎంతసేపిట్టా పట్టుకు నుంచోవాలి?" అంది స్వర్ణ. ఈ మానుగాయీ గచ్చకాయీ మొదలుపెడితే ఆపదు ముసలమ్మ

"నాకు ఒక రుమాల కావాలి, కళ్ళు తుడుచుకోడానికి," అంది ఆవిడ జీరగా.

"ఇక్కడ రుమాళ్ళేమీ లేవు మరి..."

"సరేలే అవ్వే లోపలికి పోతయ్ నీళ్ళు! టాబ్లెట్ ఇవ్వు." అంది ఆవిడ గబిక్కిన టాబ్లెట్ మింగేసి ఒక పనైపోయిందన్నట్లు మళ్ళీ పడుకోబోతూ.

"మళ్ళీ పడుకోకు మామ్మా! నువ్వు అన్నం తినాలిప్పుడు. నీకు పన్నెండింటికల్లా టాబ్లెట్ వేసి అన్నం పెట్టమన్నారు మేడమ్..." అని ఆవిడ మొహం చూడకుండా పళ్ళెంలో అన్నం పెట్టుకొచ్చింది...

"చూడూ పిల్లా! నేనిదంతా ఇవ్వాళ తినలేను. నాకు బాగాలేదు. మీ మేడమ్ అడిగితే తిన్నానని చెప్పు... నాకు మజ్జిగన్నం చాలు. మిగిలింది పడెయ్."

స్వర్ణ ఏమీ అనలేదు. తిన్నది చాల్లే అనుకుంది. మజ్జిగ అన్నం తినేసి, "పిల్లా నా అలమార తీసి అందులో లేత అరిటాకు పచ్చ మంగళగిరి చీరుంటుంది తెచ్చి నాకు కప్పు," అంది

"అదేంటి మామ్మా! చెమట పోస్తా వుంది కదా?"

"నాకు వంటిమీద చీరె లేకపోతే తోచదు. అదంతా నీకెందుకు? చెప్పినట్టు చెయ్. నీక్కావాలంటే ఫ్యానేసుకో," అని కొంచెం విసుక్కుని కళ్ళు మూసుకుంది.

అదివరకు పనిచేసిన చోట ముసలమ్మకి గౌన్లంటే చాలా ఇష్టం. వయసులో వున్నప్పుడు రాత్రిపూట వేసుకోవాలని చాలా అనుకునేదంట. కాని వాళ్ళాయన అసలొప్పుకోలేదంట. ఒంటిమీద ఎంత హాయిగా వుందో అని మురిసిపోయేది. 'ఏంటో కర్మ! ఈ ముసలమ్మల్తో వుండీ వుండి నేనూ ముసిల్దాన్నయిపోతున్నా', అనుకుంది స్వర్ణ. ఇక సాయంత్రం ఏ నాలుగింటికో రెండు బిస్కెట్లూ కాస్త కాఫీ ఇచ్చేదాకా ఈవిడ తన జోలికి రాదు, బాత్రూమ్ ఒస్తే తప్ప. బాత్‌రూమే మరి కష్టం. లోపలకెళ్ళేదాకా ఆగదు. మధ్యలోనే దిగబడి పోతుంది. తనకి మూడురోజులదాకా కడుపులో తెములుతుంది. అన్నం తినబుద్ధికాదు. నాయనమ్మ పక్క మార్చడానికి ఎంతవిసుగొచ్చేదో! పాపం! ఎట్టా వుందో ఏమో!

"ఏమిటో పిల్లా ఇట్టా అయింది నా పరిస్థితి... పాపం నిన్ను కష్టపెట్టాను." అని ముసలమ్మ కూడా సరిగ్గా తిండి తినదు. కడుపు మాడ్చుకుంటుంది. నీరసమొచ్చి నోట్లో మాటరాదు. అప్పుడు మేడమ్ బాగా కేకలేస్తుంది. అదివరకు పనిచేసినచోట ముసలమ్మ స్వర్ణని బాగా ఏడిపించింది. ఆ ఇంటివాళ్ళు కూడా అంతే. ఒకటే గసిరేసే వాళ్ళు. తిండి కూడా సరిగ్గా పెట్టేవాళ్ళుకాదు. పోనీ ముసలమ్మనైనా బాగా చూసే వాళ్ళు కాదు. అవిణ్ణీ గసిరేవాళ్లు.... అస్తమానమూ, 'పదివేలు వొదులుతున్నయ్ మాకు," అనేవాళ్ళు... వాళ్లకి వొదిలేది నిజమే కానీ తనకొచ్చేదెంత? అందులో సగమే కదా సుబ్బారావు సార్ తన కిచ్చేది! అప్పుడు సార్‌తో ఏడ్చి మొత్తుకుంటే ఇక్కడికి మార్చాడు. ఇక్కడ ఫరవాలేదు. కానీ ముసలమ్మ బాత్రూమ్‌తోనే కంపు. ఒప్పుకున్నప్పుడు చెయ్యాల్సిందే. కావాలంటే గ్లవ్సూ మాస్కులూ అడుగు అని సార్ కోప్పడ్డాడు. అవును కదా మరి, ఆవిడని చూసుకోడానికే కదా ఇన్నేసి వేలు గుమ్మరిస్తున్నారు వాళ్ళు.

స్వర్ణకి బాగా విసుగొస్తోంది. ఈవిడ కొడుకింటికి వెళ్ళిపోంగానే తనూ ఇంటికెళ్లి పోవాలి. ఇంకొద్దు బాబోయ్ ఈ ఉజ్జోగం. పొలంపనే హాయి. ముసలమ్మ మళ్ళీ తనలో తనే మాట్లాడుకుంటోంది. ముసలమ్మ ఎప్పుడూ రంగుల గురించి కలవరిస్తూ వుంటుంది. గచ్చకాయ, మానుగాయ, ఇటికరాయి, మిరప్పండెరుపు, పెసరపచ్చ, నెమలిపింఛం, తోపురంగు, నిమ్మపండు, వంగపువ్వు, నారింజ, పసుపు, ముదురు నీలం, రత్నావళి, బచ్చలిపండు, అరిటిపువ్వు – అయ్యబాబోయ్! ఏం భాషా ఏం లోకమో! తమ చేత్తో పిలిస్తేనే రమ్మని చెప్పింది కదా! అంతలోనే స్వర్ణకి సునీత నుంచీ ఫోన్ వచ్చింది. ఆ పిల్ల వున్నచోట ముసలాయన మొదటిరోజు తాతయ్యా అని పిలిస్తే తిట్టాడంట. 'ఎవడే నీకు తాతయ్య! నన్ను సార్ అని పిలు" అని గుడ్లురిమాడంట. నవ్వుకుంటూ చెప్పింది. ఆయనకి తాతయ్యా సార్ అని పేరు పెట్టింది.

"పేషంట్లు మీ స్వంత తాతయ్యా మామ్మలనుకోండి, వాళ్ళని ప్రేమగా చూడండి. ఎపుడూ విసుక్కోమాకండి. నవ్వుతూ వుండండి, అంటాడు కదా మన సారు, గాడిదగుడ్డేంగాదూ! సంగం డబ్బులు ఆయన పోసుకుంటాడు మనకేమో సుద్దులు చెబుతాడు. అసల్కి మనం ఈనకి సంపాయించిస్తున్నట్టు కనపడతాంది నాకు. నేనింకుండను. జీతమియ్యంగానే ఎల్లిపోతా." సునీత చాలా కబుర్లు చెప్పింది. ఈ ఫోన్ గాని లేకపోతే ఈ పాటికి పిచ్చెక్కిపోను అనుకుంది స్వర్ణ. ఇట్టాగే సాయంకాలం మేడమ్ వచ్చేదాకా కాలక్షేపం. ఫోన్లు రాకపోతే ఎఫ్.ఎం. రేడియో.

"ఉక్కగా వుంటే చీరె కప్పావెందుకూ," అంది మేడమ్ వస్తూనే తల్లి గదిలోకొచ్చి.

"ఆవిడే కప్పమన్నారండి. నీకెందుకు సెప్పినట్టు సెయ్యమన్నారండి" అంది స్వర్ణ.

"ఆయన పోయినప్పుడు మా తమ్ముడు నాకు తెల్లచీరె తెచ్చి పెట్టి ఒకే మైన ఏడ్చాడు. నేను తీసుకోలేదులే వాణ్ణి బాగా తిట్టి పంపించాను. అప్పుడే ఒక తెల్లగౌను వేసుకుని, గుండు

కొట్టించుకుంటే పుణ్యం వచ్చేదంటావా? ఏమిటో అప్పుడు నాకు పుణ్యాల మీద నమ్మకం లేదు మరి," అంది ముసలమ్మ కళ్ళు మూసుకునే.

"పొద్దుటాల్నుంచి ఇట్టాగే మాట్లాడతా వున్నారండి" అంది స్వర్ణ. మేడమ్ మొహం చిన్నబుచ్చుకుంది. వచ్చి తల్లి పక్కమీద కూచుని, "అమ్మా" అని పిలిచింది. ఆవిడ పలకలేదు.

"అమ్మా! కాఫీ తాగావా?" అంది మళ్ళీ. ముసలమ్మ మాట్లాడలేదు. "అమ్మ నా మీద అలిగింది. ఆవిడ సౌకర్యం కోసమే కదా నేను ఇట్లా చేశాను. పోనీలే... నువ్వు తాగలేదంటే నాకూ వద్దు. నేనూ తాగను", అని మంచం మీద నుంచి లేవబోయింది.

ముసలమ్మ కూతురు చెయ్యి పట్టుకుని, "పిల్లా అమ్మాయికి కాఫీ తెమ్మని వంటామెకి చెప్పు. నాక్కూడా రెండు చుక్కలు ఇవ్వమను. పాలు తక్కువ, డికాషన్ ఎక్కువ. చక్కెర వద్దు," అంది, చీరె వంటినిండా కప్పుకుని లేచి కూచుంటూ.

"మామ్మగారు రుమాలు అడిగారండి, నాకు కనపడలేదు. ఉంటే రెండు ఈ గదిలో పెట్టండి," అంది స్వర్ణ.

"అయ్యో! ఇప్పుడే పెడతాలే! భోజనం చేసిందా మరి అలిగి కూచుందా?" అంది కూతురు తల్లికి దగ్గరగా జరిగి.

స్వర్ణ చెప్పేలోగానే అందుకుని, "ఎందుకు చెయ్యనూ! చేశాను..." అంది ముసలమ్మ.

"వెళ్ళి నీ పని చూసుకో పో! నేను బాగానే వున్నాన్లే! ఇప్పుడేకదా వచ్చావూ... పిల్ల వుందిగా నా దగ్గర. వెళ్ళు," అని కూతురి నడుంమీద చెయ్యి వేసింది ముసలమ్మ. మేడమ్ వెళ్ళిపోయింది. మళ్ళీ తనూ ముసలమ్మా ఎఫ్.ఎం రేడియో, ఫోనుల్లో కబుర్లూ.

ముసలమ్మ ఉన్నట్టుండి కళ్ళు తెరిచి చేత్తో సైగ చేసి పిలిచింది. బాబోయ్ బాత్‌రూమేమో, అనుకుని స్వర్ణ గుండె గుభేలుమంది. "దేవుడి మందిరంలో ఒక గంట వుంటుంది. మేడమ్ నడిగి పట్రా పో," అంది! అమ్మయ్య! కానీ ఇప్పుడు గుంటెందుకో! పద్యాలకి తోడు గంట మోగిస్తూ కూచుంటుంది కామాల.

"పోయి టీవీ చూసుకో పో. నాకు అవసరమైతే గంట మోగిస్తా, వద్దువుగాని. గంట వినిపించుకో," అంది. పోనీలే! ఇంక తిండివేళ దాకా పిలవదు. ఈలోగా దేవుడు దయ వుండి బాత్‌రూమ్ రాకుండా వుంటే!

ఉన్నదేదో తిని టీవీలో సీరియల్ మీద సీరియల్, ఆ తరవాత పాత తెలుగు సినిమాదాకా చూసీ చూసీ నిద్రకిపడ్డం! పొద్దున అమ్మ నడ్డిమీద రెండిచ్చి లేపేదాకా నిద్రే నిద్ర! రేతిరి ఈ ముసలమ్మ ఎన్నిసార్లు లేపుతుందో! మంచినీళ్ళంటది, బాత్ రూమంటది. ఒకసారి చలి పుడుతోంది, ఫ్యాన్ తియ్యమంటది. ఒకసారి ఉక్కపోస్తోందీ ఫ్యాన్ వెయ్యమంటది. పగలు ముసలమ్మ నిద్ర పోయేటప్పుడు కాస్త పడుకుందామంటే ఫోన్లొకటి.

టీవీలో మేడమ్ రాత్రి ఎనిమిదిన్నరకి చూసే సీరియలొచ్చింది. ఆ సీరియల్ తను టెంత్‌లో వుండగా మొదలైంది. తను రెండేళ్ళు తప్పినా అది మాత్రం వస్తోందన్న మాట. అప్పుడు గంట కొట్టింది మామ్మ. స్వర్ణకి చాలా కోపమొచ్చింది. తప్పదుగదా! వెళ్ళి చూసేసరికి మామ్మ కళ్లనిండా నీళ్ళు. రెండు వేళ్ళు చూపించి బాత్‌రూమ్‌కి తీసుకెళ్లమని లేచి మంచం మీద కూచునేలోగానే బట్టలు పాడైపోయాయి. గతంతా ఒకటే వాసన. మేడమ్ ఇంట్లో లేనప్పుడైతే ముసలమ్మని కాస్త కోప్పడి వుండేది. ఏ మాటకామాటే చెప్పాలి ఈ ముసలమ్మ తన మీద మేడమ్‌కి సాడీలేం చెప్పదు. స్వర్ణకి ఏడుపొచ్చింది. ఏడుస్తూనే అలమార్లో నుంచి గ్లవ్సూ మాస్కూ తీసుకుని ఆవిడ బట్టలు విప్పించి అదంతా శుభ్రం చేసి ఆవిడకి కొత్తగౌను తొడిగి ఇంకో చీరె కప్పి పాడైపోయిన బట్టలు పంపు కింద కడిగి, సబ్బూ, డెట్టాల్‌లో నానబెట్టి.... తను వెళ్ళి స్నానం చేసొచ్చేసరికి సీరియలేకాదు వార్తలు కూడా అయిపోయాయి. అప్పటికే అమ్మకి భోజనం ఆలస్యం అయిందని కోపం వచ్చింది మేడమ్‌కి. తను పెట్టొచ్చుకదా!

స్వర్ణకి అన్నం సహించలేదు. భళ్ళున వాంతి వచ్చింది. ప్రేమలతమ్మ గొంతు పిసికేద్దామని పించింది.

ముసలమ్మ పడుకుంది. బెడ్‌లైట్ వేసి కాస్త దూరంగా మడత మంచం వేసుకుని పడుకుంది స్వర్ణ. ఎవరో ఏడుస్తున్నట్లనిపించి ముసలమ్మ వైపు చూసింది. ముసలమ్మే ఏడుస్తోంది.

"ఏమైంది మామ్మా? ఎక్కడైనా నొప్పా? మేడమ్‌ని పిలవనా?" అంది దగ్గరగా వెళ్ళి.

"ఇంతకాలం బ్రతకడమే పెద్దనెప్పి. ఇంకా ఎంతకాలం బ్రతకాలో అని ఏడుపొచ్చింది. నువ్వు పడుకో పో! నాకే నెప్పీలేదు."

స్వర్ణకి పడుకోబుద్ధి కాలేదు. ముసలమ్మ చాలాసేపు ఏడ్చింది. ఆవిడ మీద చిరాకు కలగకపోగా గమ్మత్తుగా తనకీ కళ్ళెంట నీళ్ళొచ్చాయి.

"ఏడవకు మామ్మా! మన సేతుల్లో ఏముంది"! అంది, అరిందలాగా.

"అందర్నీ ఇబ్బంది పెడుతున్నాను. నిన్ను కూడా! పాపం చిన్నపిల్లవి".

"నాకేం ఇబ్బంది లేదులే మామ్మా! నా ఉజ్జోగం అదేగా! నువ్వు పడుకుని నిద్రపో..." అంది, తన గొంతులో మెత్తదనానికి ఆశ్చర్యపడుతూ.

ముసలమ్మ మాట్లాడలేదు. స్వర్ణకి కూడా నిద్రరాలేదు. నాయనమ్మ గుర్తొచ్చింది. రేపు ఇంటికి ఫోన్ చెయ్యాలి. ఈసారి జీతంలో నాయనమ్మకి ఒక మంచి దుప్పటీ ఒక మెత్తని దిండూ కొనాలి అనుకుంది. నిద్రమాత్ర పని చేసినట్టుంది. ముసలమ్మ కాసేపటికి కళ్ళు మూసుకుంది. అసలు దీనంతటికీ కారణం తనా అని ఉలిక్కిపడింది స్వర్ణ. ఆ మధ్య ముసలమ్మకి నాలుగు రోజులపాటు విరేచనాలై జ్వరం కూడా వచ్చింది. అప్పుడు చీరెలు విప్పడం కట్టడం వాటిని ఉతకడం పెద్ద చావైపోయింది. అప్పుడే మేడమ్ ఈవిడ వేషం మార్చింది. క్రాపు కొట్టించి నైటీలు వెయ్యడం మొదలుపెట్టింది. అప్పట్నుంచీ ఈవిడ తిండి తగ్గించేసింది. చనిపోతే

బాగుండనుకుంటోంది కామాల పాపం! చీరెల కోసం ఇంత దుక్కమా? అని ఆశ్చర్యం వేసింది. అయ్యో! పాపం అనిపించింది.

"ఏం మామ్మా! ఇయ్యాళ తానంచేసి గచ్చకాయా, మానుగాయా, ఇటికరాయా, వంగపువ్వా, నిమ్మపండా, బచ్చలిపండా?" తెల్లవారి నవ్వుకుంటూ అడిగింది స్వర్ణ.

"నీకు విసుగ్గాలేకపోతే కాసేపు నీతో మాట్లాడనా?" అంది ఆవిడ.

"అయ్యో మాట్లాడు మామ్మా! రేత్రి నువ్వేడిస్తే నాకు శానా దిగులేసింది."

"అయితే విను. ఇప్పుడు నాకు ఎనభై అయిదేళ్ళు. పదిహేనో ఏట పెళ్ళైంది. పెళ్ళి కాంగానే పరికిణీ ఓణీలు మాన్పించి చీరెలు కట్టించారు. చదువు మాన్పించారు. నాకు వంటపని లేదు. అందరికీ అన్నీ అందించే పని. నా అంతట నేను ఏ పనీ చెయ్యకూడదు. చెప్పింది చెయ్యాలి. ఏదైనా చెయ్యాలనుకుంటే అడిగి చెయ్యాలి. అడిగిన దానికి ఎప్పుడూ అనుకూల సమాధానం రాదు. చదువుకోడానికి పుస్తకాలు లేవు. హాయిగా నవ్వుకోడానికి మనుష్యులు లేరు. అట్టా వుండేది. ఏం చెయ్యాలో తెలిసేది కాదు. మా పుట్టింట్లో చాలా మొక్కలుండేవి. మా నాన్నకి మొక్కలంటే ఎంతిష్టమో. ఆయన ఎక్కడెక్కడ్నించో పూలమొక్కల విత్తనాలు తెచ్చేవాడు. కనకాంబరం వుందంటే అందులో లేతరంగు. మళ్ళీ సౌందర్య కనకాంబరం అని ముదురురంగు పసుపుపచ్చ. చంద్రకాంతాలైతే పదిరంగులుండేవి. రాధామనోహరాలూ మందారాలెన్ని రంగులో. ఎక్కడెక్కడినించో తెచ్చేవాడు. మా వాకిలీ పెరడూ రంగుల ఇంద్రధనస్సులా వుండేది! నాకా రంగులు చూడ్డం చాలా ఇష్టంగా వుండేది. నేనూ మా పెద్ద చెల్లీ ఏదైనా ఒక మొక్క మొగ్గ తొడిగిందంటే అది విచ్చేవరకూ రోజూ కనిపెట్టుకుని చూస్తూ వుండేవాళ్ళం. ఆఖరికి జిల్లేడుపూల రంగుకూడా బాగుండేది ఆకు. ఎప్పుడూ మొక్కల మధ్యే వుండేవాళ్లం. ఈ రంగుల మీద ప్రేమని నేను చీరెల మీదకి మళ్ళించుకున్నానేమో తెలీదు. మా అత్తవారింట్లో పేపర్లూ పుస్తకాలూ కొనరు. సంగీతం వినరు. కలిసి కూచుని మాట్లాడుకోరు. వాకిలీ పెరడూ అంతా గచ్చు. ఒక పూలకుండీ కూడా కొననివ్వరు. కానీ బాగా బట్టలు కొంటారు. ఎన్ని చీరెలైనా కొనుక్కోమంటారు. నాకు అంచులుండే చీరెలంటే మొదటినించీ చాలా ఇష్టం. అంచుల్లేని చీరెలు నచ్చేవి కాదు. ఏ రంగు చీరెకి ఏ రంగు అంచుంటే బాగుంటుంది అని ఎవరు ఏ చీరె కట్టుకున్నా గమనిస్తూ వచ్చేదాన్ని. పిల్లలు పుట్టినా వాళ్ళు పెరుగుతున్నా నా చీరెలకి ఎలాంటి ఇబ్బందీ వుండేది కాదు. సినిమాకి పోతే ముందుగా న్యూస్‌రీల్ అని చూపించేవాళ్ళు. అందులో ఇందిరాగాంధీ కట్టిన చీరెలు చూసేదాన్ని. అట్లాగే టీవీ వచ్చాక అందులో మీను అని ఒకామె ఇంగ్లీష్ వార్తలు చదివేది. ఆమె చీరెలు ఎంత బాగుండేవో? వార్తల్లో తప్పులు చదివేదట కానీ చీరెల ఎంపిక అద్భుతం అనుకో! ఇంక ఎక్కడ ఏ ప్రదేశానికి వెళ్ళినా ముందు అక్కడి ప్రత్యేకమైన చీరెలు కొనుక్కోడం నా మొదటి పని! చుట్టాలిళ్ళల్లో పెళ్ళిళ్ళయితే నేనే వెళ్ళి చీరెలు ఎంపిక చెయ్యాలి. ఆ విధంగా నేను చిన్నప్పుడు పూలల్లో ప్రకృతిలో ఇష్టపడిన రంగులన్నింటినీ నా చీరెల్లో

చూసుకన్నాను. అవే నా జీవితాన్ని వెలిగించిన రంగులు. మా ఆయన పోయిన కొత్తలో నా చీరెలు పంచుకుందాం అని చూశారు నా కూతురూ కోడలూ. నేనివ్వలేదు. ఒకటీ అరా నగలుంటే ఇచ్చాను. నాకు మొదట్నించి నగలిష్టం వుండేవి కాదు. ఇదంతా నీకర్థం కాదు. కానీ ఈ రంగులన్నీ కలిసిపోయి ఒక తెలుపే మిగిలిన ఈ క్షణంలో ఎవరితోనైనా చెప్పుకోవాలనిపించింది. మా అత్తగారు మంచంపడితే నేనే చేశాను. ఆమె నేను పెడితేనే అన్నం తినేది. మా ఆయనకి నేనే చేశాను. ఆయన నా చెయ్యి పట్టుకుని కళ్ళుమూశారు. ఇప్పుడు నాకు తోడుగా నువ్వు ఎక్కడినుంచో వచ్చావు. కాలం మారింది. మా కుటుంబంలో ఇంత కాలం ఎవరూ బతకలేదు. మనిద్దరికీ ఎప్పటి ఋణానుబంధమో".

"అంత పెద్దమాటలు నాకు తెలీవు మామ్మా! నువ్వు డబ్బులిస్తున్నావు నేను పని సేస్తున్నానంతే. కానీ నువ్వు ఏడిస్తే నాకు దిగులేసింది. నువ్వేడవద్దు. నీ బాత్రూమ్ నీ చేతిలో లేకపోతే నువ్వుమాత్తరం ఏం జేస్తావ్? రేపటాల్నించీ నీకు ఒకరోజు గచ్చకాయ, ఒకరోజు మానుగాయ, ఒకరోజు ఇటికరాయ చీర నే కడతాగందా!" అంది స్వర్ణ.

"ఈ వయస్సులో ఇంకా రంగుల మీద మోహం ఎందుకమ్మా? అట్లా ఒక్క ఉప్పెనలాగా వచ్చింది దుఃఖం, అంతే! అది చీరెల్ని గురించిన దుఃఖం కాదు. సరే చెప్పు, నువ్వు కూడా ఏడ్చావు కదా రాత్రి. నేను బట్టలు పాడుచేసుకున్నప్పుడు, నిన్నిక్కడకి పంపించిన ప్రేమలతమ్మని తిట్టుకున్నావు కదా? అట్లాగే నేనూ నా చిన్నప్పుడు నన్ను నూరేళ్ళాయుష్షు అని దీవించిన వాళ్ళని తిట్టుకుంటూ ఏడ్చాను అంతే! కానీ తప్పేదేం వుంది. పిలుపొచ్చేదాకా అనుభవించాలి కదా?"

ఆవిడ మొహంలోకి అట్లా చూస్తూ వుండిపోయింది స్వర్ణ.

❄

తెలుగు వెలుగు, మార్చి 2013, కరిగిన రంగులు పేరుతో ప్రచురితం